క్లుప్తంగా

దివ్యాంగులకు భోజనాల వితరణ



దివ్యాంగులకు వడ్డిస్తున్న బూస అప్పలరెడ్డి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలువురి దివ్యాంగులకు జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వద్ద భోజనాలు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బూస అప్పలరెడ్డి ఆర్థిక సాయంతో సుమారు 200 మంది దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముందు దివ్యాంగులైన మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూస కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్

మల్కాపురం: మల్కాపురం శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి 16 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ చెప్పారు. పిల్లల్లో చదివే అలవాటు పెంచడానికి,కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఈ శిబిరం ఎంతగానో దోహదపడుతుందన్నారు. తల్లిదండ్రులు,పిల్లలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరం రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో న్యాయవాది విశ్వనాథరాజు, రచయిత సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న షిప్‌యార్డ్ ఫైనాన్స్ డైరెక్టర్ రాంబాబు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఉద్యోగుల పిల్లల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం షిప్‌యార్డ్ ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వి.రాంబాబు ప్రారంభించారు. షిప్‌యార్డ్‌కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సంస్థ వెల్ఫేర్ అండ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ మొదలగు ఆటల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు పిల్లల్లో శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఆటలపై ఆసక్తి చూపి మెలకువలు నేర్చుకోవాలని, వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ భేగ్, సునీల్‌జయంతి, షిప్‌యార్డ్ కార్మికులు పాల్గొన్నారు.

వైభవునికి లక్షమల్లెలతో అర్చన



లక్షమల్లెల అర్చన అందుకున్న వైభవుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఉదయం స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవ వేంకటేశ్వరుడికి లక్ష మల్లెలు సమర్పించారు. సాయంత్రం సదస్యోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నగరానికే 'గైస్' గర్వకారణం

మేయర్ హరివెంకటకుమారి



కళాశాల అధ్యాపకులతో నగర మేయర్ హరివెంకట కుమారి



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మురళీనగర్: పాలిటెక్నిక్ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ నూరు శాతం ఉద్యోగాలు సాధించడం విశాఖ నగరానికే గర్వకారణమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక ఏడాదిలో 243మంది ఉద్యోగాలు సాధించడం రాష్ట్రంలోనే ఒక రికార్డు కాగా వీరిలో 54మంది బాలికలు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలో 85మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గైస్ విద్యార్థిని డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో అత్యధిక ప్యాకేజీ రూ.6.73లక్షలు పొందిన మొట్టమొదటి విద్యార్థినిగా రికార్డు సాధించిందని ఆమె ప్రశంసించారు. వీరిని జూనియర్స్ ఆదర్శంగా తీసుకుని ఉన్నత అవకాశాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశలతో పాటు తమ ఆశయాలు నెరవేర్చుకునేందుకు విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఇలాంటి జాబ్ అచీవర్స్ ఉత్సవాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయన్నారు. ప్రత్యేక అతిథి, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజనీ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల సాధనలో రికార్డు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపాల్‌గా గ్లోబల్ అచీవ్‌మెంటు అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 243మందికి మేయర్ హరి వెంకటకుమారి, కార్పొరేటరు రజనీ ఈశ్వరరావు నియామక పత్రాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరించారు. ముందుగా లవ్ గైస్ లోగోను మేయర్ హరివెంకట కుమారి కార్పొరేటర్ రజనీ ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీడీ లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.రామమోహన్‌రావ్, కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, సభ్యులు డాక్టర్ బోకం దేముడు, యూఎస్ శర్మ, బీఎస్ రామమోహన్, కెమికల్ ఇంజినీరింగు హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, ఓఎస్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కు రుణపడి ఉంటాం..

మల్కాపురం: రోడ్డున పడ్డ తన సోదరుడు రాజును ఆర్థికంగా ఆదుకుని, వ్యాపారం చేసుకునేలా తోడ్పాటునిచ్చిన ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు రుణపడి ఉంటామని సోషల్ మీడియా ప్రతినిధి స్పందన బాబూరావు అన్నారు. ఆనంద్‌కుమార్‌ను మంగళవారం ఆయన కార్యాలయం వద్ద బాబూరావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో చింత చెట్టు కింద బ్యాగులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న ములగాడ రాజు షాపు ఇటీవల తొలగింపునకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న ఆడారి ఆనంద్‌కుమార్ రాజుకు హాకర్స్ జోన్‌లో ఓ షాపులో తిరిగి వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించి.. రూ.40 వేల ఆర్థిక సాయం చేశారు. దీంతో రాజు తన వ్యాపారాన్ని ప్రారంభించారు. అందుకు కృతజ్ఞతగా స్పందన బాబూరావు ఆనంద్‌కుమార్‌ను కలిసి.. పారిశ్రామిక ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



ఆనంద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బాబూరావు

విజయ దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా



భక్తుల పూజలందుకున్న దుర్గాదేవి

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండ ఎగువ ప్రాంతంలో వెలసిన విజయ దుర్గ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కులు ఉన్న వారు ఘటాలు, చీరలు, గాజులు సమర్పించారు. ఎమ్మెల్యే గణబాబు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. కొండవాలు ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వాటిని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, మెట్ల మార్గాలు, సీసీ రోడ్లు, మంచినీటి సదుపాయం వంటి సమస్యలపై దృష్టి సారించామన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందజేత



పారిశుధ్య కార్మికులకు నూనె బాటిళ్లు అందిస్తున్న బెహరా భాస్కరరావు, జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె బాటిళ్లను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందజేశారు. రైతు బజారులోని పారిశుధ్య కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జోన్-8 కమిషనర్ మల్లయ్య నాయుడు మాట్లాడుతూ తొలి విడతలో ప్రతీ కార్మికునికి కొబ్బరి నూనె అందించామని తెలిపారు. మరో విడతలో సబ్బులతో పాటు మరి కొన్ని సామగ్రి అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, దమ్ము శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

సింధియా: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లు ప్రతి నెలా సూర్యుడు ఉదయించక ముందే వలంటీర్లతో పంపిణీ చేయించడం హర్షించదగ్గ విషయమని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హత గల ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల పింఛన్ అందనివారికి పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో పింఛను ప్రతి నెలా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు చంటిబాబు, మీసాల సత్యనారాయణ, పెంట్ల బాలకృష్ణ, సుధాకర్, గోపాలకృష్ణ, యామిని తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాలంకరణలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కనక మహాలక్ష్మీ అమ్మవారిని అష్టదళ పద్మాలతో అర్చించారు. బురుజుపేటలో కొలువుదీరిన అమ్మవారిని 108 స్వర్ణపుష్పాలతో పూజించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

4న సహస్ర తులసిపూజ

ఈ నెల 4న నిర్వహించనున్న సహస్ర తులసిపూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1500 పూజా రుసుం చెల్లించాలని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో దంపతులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రెండేళ్లలో మూడు లక్షల ఉద్యోగాలు

మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో యువతకు మూడు లక్షల ఉద్యోగాలు వస్తాయని మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయో త్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం పాలిటెక్నిక్ విద్యార్థులకు లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ పోర్టులోనే 25వేలు ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్లమో విద్యార్థులు కోర్సుల పూర్తి కాగానే వచ్చే ఉద్యోగావకావకాశాలను వదులుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ మేళా సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీల్లో చేరిన వారు నిబద్ధతతో పని చేస్తే అత్యధిక ప్యాకేజీలు వస్తాయన్నారు. డిప్లమో అనంతరం ఉన్నత విద్యకు వెళ్లడం కన్నా ఉద్యోగాల్లో చేరడం తెలివైన పనిగా ఆయన పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ అసిస్టెంటు కమిషనర్ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ సైబర్ క్రైంపై విద్యార్థులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఉద్యోగాలు పొందిన 172 మంది విద్యార్థులకు మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో హేమ ఎడోబ్స్ చైర్మన్ బి.సురేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ అకడమిక్ సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంటు సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి కాలేజీలోని స్కిల్ హబ్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు.



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న మారిటైమ్ బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి

14న హనుమజ్జయంతి

దాబాగార్డెన్స్: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 14న హనుమజ్జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. ఆ రోజు ఉదయం 5 గంటలకు నాదస్వర కచేరితో ప్రభాత సేవ, 5.30 నుంచి 7.30 గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి దర్శనాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి దర్శనాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ కొండూరి గాయత్రిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు కౌంటర్‌లో రూ.216 చెల్లించాలని తెలిపారు.

'మా నాయనే వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా'



ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో సన్యాసమ్మకు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, ప్రగడ వాసు

అల్లిపురం: 'మా నాయనే నన్ను వెతుక్కుని వచ్చి పెన్షన్ ఇచ్చావా' అంటూ పెదవాల్తేరుకు చెందిన సామాజిక పింఛన్ లబ్ధిదారు సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం సన్యాసమ్మ కుమారుడిని కాలికి వైద్యం నిమిత్తం టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ సిబ్బంది కేజీహెచ్‌లో చేర్పించారు. రోడ్డు పక్కన చిన్న పరదాతో కట్టుకున్న గుడిసెలో ఉన్న ఆమెను చూసేవారు లేకపోవడంతో ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఒకటో తేదీ రావడంతో తనకు పెన్షన్ రాదేమోనని భయపడుతున్న ఆమెకు మంగళవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీ సచివాయం వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ వలంటీర్‌తో వచ్చి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో ఫించన్ మొత్తం రూ.2,750 అందజేశారు. దీంతో సన్యాసమ్మ ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసింది.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి



గాంధీనగర్‌లో మహిళలకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్న వైఎస్సార్ సీపీ పాలనలో ఎంతో లబ్ధి పొందామని ప్రజలు చెబుతున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామని స్పష్టం చేస్తున్నారని ఆ పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు గాంధీనగర్‌లో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రతీ ఇంటికి వెళ్లి.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఇదే విధంగా లబ్ధి చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంతా అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అంతకుముందు ఆయనకు ప్రజలు అడుగడుగునా హారతులిచ్చి నీరాజనాలు పలికారు. సుమారు 300పైగా కుటుంబాలను ఆయన కలిశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, అప్పలరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు

- నిరుపేదలకు అండగా నిలిచిన ఆనంద్
- మూడు కుటుంబాలకు నెలకు రూ.2,750 చొప్పున పింఛన్ అందజేత



నిరుపేద కుటుంబ సభ్యుడికి పింఛన్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మల్కాపురం: వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆపదలో ఉన్న వారు, నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. ఏ నాయకుడైనా మాట ఇస్తే అమలు చేయడానికి నెలలు, సంవత్సరాలు పడుతుంది. ఆయన మాట ఇచ్చి కొన్ని రోజుల్లోనే నిలబెట్టుకున్నారు. జీవీఎంసీ 61వ వార్డులో గత వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గాంధీజీ వీధి ప్రాంతానికి చెందిన మూడు కుటుంబాలు తమకు పింఛన్ రావడం లేదని ఆడారి ఆనంద్‌కుమార్‌కు విన్నవించారు. సాంకేతిక సమస్యల కారణంగా వారికి పింఛన్ నిలిచిపోయిందని తెలుసుకున్న ఆయన.. ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు తానే ఇస్తానని మాట ఇచ్చారు. ఈ నెల నుంచి నెలకు రూ.2,750 చొప్పున మూడు కుటుంబాలకు అందించేలా సొంత నిధులు కేటాయించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు మంగళవారం ఆ కుటుంబాలకు ఈ మొత్తం అందజేశారు. లబ్ధిదారులు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా పైడితల్లమ్మ పండగ



పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు



మావూరి వెంకటరమణకు అమ్మవారి శేష వస్త్రాలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో వెలసిన పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలతో అభిషేకాలు చేశారు. చీరలు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దర్శించుకున్న నాయకులు

పండగ సందర్భంగా పైడితల్లి అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకున్నారు.ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే గణబాబు తొలి పూజలు చేశారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు.

ఆకట్టుకున్న పరస, సాంస్కృతిక కార్యక్రమాలు

సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరస ఆకట్టుకుంది. చిన్నారులు రంగుల రాట్నాల్లో తిరుగుతూ కేరింతలు కొట్టారు. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

7 నుంచి దుర్గమాంబ మహోత్సవాలు



దుర్గాదేవి అమ్మవారు



ముస్తాబవుతున్న దుర్గాదేవి ఆలయం

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్యదైవం దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు శ్రీ రామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. 7న దుర్గమాంబ జాతర చాటింపు, 8న తొలేళ్ల సంబరం, 9న ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. 9న ప్రధాన జాతర మహోత్సవాన్ని గొల్లకంచరపాలెం శ్రీసీతారామ సంపత్ వెంకటేశ్వర, ధనలక్ష్మీదేవి ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమలు కావాల్సిన భక్తులు ముందుగా పేర్లు నమోదుకు ఉత్సవ కమిటీ సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

పోస్టల్ సంఘాల గుర్తింపు రద్దు అప్రజాస్వామికం

దాబాగార్డెన్స్: అర్థం లేని కారణాలతో పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్/డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సంఘాల గుర్తింపును కొనసాగించాలంటూ మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల సభ్యులు మాట్లాడుతూ ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైగా సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుతో గుర్తింపు రద్దు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆ రెండు సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, పెంటయ్య, ఇళ్లపురెడ్డి, శర్మ, మీనాకుమారి, రాధ, మంజుల, గోవిందరావు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న సభ్యులు